సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



శక్తిపీఠం ముస్తాబు
రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన జోగుళాంబ క్షేత్రం మహాశివరాత్రికి ముస్తాబైంది.

వివరాలు 8లో ▸



అనుమతులు రద్దుచేయాలి
కెమికల్స్ కంపెనీ ఏర్పాటు అనుమతులు రద్దు చేయాలని రవిచంద్ర అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.9 /17.4

వాతావరణం
ఉదయం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లో శాశ్వత పరిష్కారం పొందాలి



పాలమూరు: మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో బ్యాంకు ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించే దిశగా బ్యాంకు అధికారులు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. జిల్లా కోర్టు ఆవరణంలో సోమవారం అన్ని రకాల బ్యాంకు మేనేజర్లతో న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న బ్యాంకు సంబంధించిన సెటిల్‌మెంట్ కోసం గుర్తించిన కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్ రూపంలో వచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. తప్పకుండా వారి కేసుల్లో హాజరై శాశ్వత పరిష్కారం పొందాలన్నారు.

పోలీస్‌స్టేషన్ విధి విధానాలపై అవగాహన
- వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన న్యాయమూర్తులు



మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్‌స్టేషన్‌లో జరిగే విధి విధానాలపై అవగాహన కోసం ఒక్కరోజు శిక్షణలో భాగంగా సోమవారం అచ్చంపేట, గద్వాల, నారాయణపేట జిల్లా కోర్టులకు చెందిన నలుగురు న్యాయమూర్తులు సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో రైటర్ దగ్గరి నుంచి సీఐ స్థాయి అధికారి వరకు నిర్వహించే విధులు, ఫిర్యాదుదారులతో ప్రవర్తన, కేసుల వివరాలు, రికార్డులు తదితర అంశాలపై సీఐ అప్పయ్య ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒక్కరోజు మొత్తం పోలీస్‌స్టేషన్‌లో జరిగే అంశాలను వారు క్షుణ్ణంగా పరిశీలించారు.

వేరుశనగ క్వింటాల్ రూ.6989
జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం వేరుశనగ క్వింటాల్ గరిష్టంగా రూ. 6,989, కనిష్టంగా రూ. 5,222 ధరలు లభించాయి. ఆముదాలు గరిష్టంగా రూ. 5,757, కనిష్టంగా రూ. 5,670, జొన్నలు రూ. 3,520, కందులు గరిష్టంగా రూ.7,092, కనిష్టంగా రూ.6,499, పెబ్బర్లు గరిష్టంగా రూ. 6,600, కనిష్టంగా రూ. 5,000, మొక్కజొన్న గరిష్టంగా రూ. 2,342, కనిష్టంగా రూ. 2,027, మినుములు గరిష్టంగా రూ.7,752, కనిష్టంగా రూ. 3,165 ధరలు వచ్చాయి.

■ దేవరకద్ర మార్కెట్ యార్డులో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం క్వింటాల్ రూ. 2,500 ధర పలికింది. కందులు రూ. 6,701, రాగులు రూ. 3,889 ధరలు వచ్చాయి.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ
జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):జిల్లాలోని గ్రామీణ మహిళల కోసం ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18సంవత్సరాల నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలు శిక్షణకు అర్హులని, 30రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈశిక్షణ కాలంలో ఉచిత వసతితో పాటు భోజనసౌకర్యం ఉంటుందని సూచించారు. ఆసక్తిగల మహిళలు ఈనెల 27వ తేదీ లోపు బండమీదిపల్లిలోని పాత డ్వామా కార్యాలయంలోని దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు సెల్ నంబర్: 9963369361, 9542430607కు సంప్రదించాలని కోరారు.



పాదయాత్రగా.. పరమేశ్వరుడి చెంతకు
- చలి, మండుటెండల్లో సైతం మాలధారుల నడక
- అభయారణ్యంలో ప్రతిధ్వనిస్తున్న శివనామస్మరణ
- శివస్వాములతో కోలాహలంగా నల్లమల రహదారి

- అచ్చంపేట

- వివరాలు 8లో..

మూడో రోజూ నిరాశే..

టన్నెల్‌లో లభించని ఎనిమిది మంది కార్మికుల ఆచూకీ



సొరంగంలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

- ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు చర్యలు
- ఎస్‌ఎల్‌బీసీకి చేరుకున్న స్నిపర్ డాగ్స్, ర్యాట్ మైనర్స్ బృందాలు
- వంద మీటర్ల దూరంలోనే ఆగిపోతున్న వైనం
- పైనుంచి రంధ్రం చేసి వెళ్లాలన్న ప్రతిపాదన విరమణ

అచ్చంపేట: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది ఆచూకీ సోమవారం మూడోరోజూ చిక్కలేదు. సహాయక బృందాలు షిఫ్టుల వారీగా టీబీఎం మిషన్ సమీపంలోకి వెళ్లేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం లేకుండాపోతోంది. నీటి ఉధృతికి కాంక్రీట్ సెగ్మెంట్‌లు ఊడిపోయి అందులో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. సోమ వారం నాటికి రాష్ట్ర విపత్తుతోపాటు ఆర్మీ, నేవీ, సింగరేణి, ఎన్‌డీఆర్‌ఎఫ్, జేపీ, నవయుగలకు చెందిన బృందాలు ఇప్పటి వరకు ఏడు సార్లు టన్నెల్‌లోకి వెళ్లి గాలింపు చేపట్టారు. ఇందులో దాదాపు 584 మంది నిపుణులైన సిబ్బంది ఉన్నారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన విపత్తులో ఈ బృందాలతో పాటు 14 మంది ర్యాట్ (ర్యాట్ హోల్ టీం) మైనర్స్, స్నిపర్ డాగ్స్ సైతం చేరుకున్నాయి. పెద్దఎత్తున బురద నీరు ఉండటంతో లోపలికి వెళ్లలేకపోయాయి. టన్నెల్ లోపలికి పైనుంచి రంధ్రం చేసి వెళ్లాలన్న (వర్టికల్ డ్రిల్లింగ్) ప్రతిపాదనలు తోసిపుచ్చారు. ఐదు గ్యాస్ కట్టింగ్ మిషన్లతో పనిచేస్తున్నారు.

వంద మీటర్ల దూరంలోనే..

లోకో ట్రైన్ ద్వారా 13.3 కి.మీ., వరకు చేరుకున్న టీం సభ్యులు బురదలోకి దిగే ప్రయత్నాలు చేస్తున్నా.. వంద మీటర్ల దూరంలో అంత చీకటిగా ఉండటంతో ఏమీ చేయలేక వెనుదిరిగి వస్తున్నారు. ఆదివారం వెళ్లిన బృందాలకు కన్వేయర్ బెల్టు కిందనే నీటి ఊట ఉండటంతో దానిపై నడుచుకుంటూ వెళ్లగా.. సోమవారం ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. తాజాగా కన్వేయర్ బెల్టు సైతం మునిగిపోయినట్లు సమాచారం. తెగిపోయిన కన్వేయర్ బెల్టును సరిచేసి ఇప్పుడు దాని ద్వారా సహాయక చర్యలు చేపట్టేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు. అలాగే సోమవారం నుంచి నీటిని తోడేందుకు 100 హెచ్‌పీ మోటార్లు ఏర్పాటు చేసినా నీటి ప్రవాహం ఏమాత్రం తగ్గడం లేదని, ఒకవేళ బురద, రాళ్లను తొలగిస్తూ.. ముందుకెళ్తే మరింత ముందుకు వచ్చే అవకాశం ఉందేమోనన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

■ ఇదిలా ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలోని ఆర్మీ చీఫ్‌తో మాట్లాడి స్పెషల్ ఎక్విప్‌మెంట్ తెప్పించే ప్రయత్నాలు చేస్తోంది. మూడు రోజులుగా విడతల వారీగా వెళ్తున్న బృందాలు నీళ్లు, బురద ఉండటంతో లోపలికి వెళ్లలేకపోతున్నామనే విషయం తప్ప చిక్కుకుపోయిన వారు కనిపించారనే సమాచారం చెప్పడం లేదు. దీంతో వారు ఇంకా బతికే ఉన్నారా అన్న చర్చ మొదలైంది. మరోవైపు మంత్రులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారుల హడావుడి తప్ప.. లోపల చిక్కుకున్న వారిని బయటికి తెచ్చే ప్రయత్నాలు ఒక కొలిక్కి రావడం లేదు. దీంతో సహాయక చర్యలు ఇలాగే కొనసాగితే.. మరో వారం రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

మంత్రులు, అధికారుల పర్యవేక్షణ
సొరంగం పనుల్లో చోటు చేసుకున్న సంఘటన జరిగిన నాటి నుంచి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రెండురోజుల పాటు ఇక్కడే ఉండి గాలింపు చర్యలను పర్యవేక్షించారు. సోమవారం రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యేలు జయవీర్‌రెడ్డి, వంశీకృష్ణ, బాలునాయక్ ఎస్‌ఎల్‌బీసీ వద్దకు చేరుకున్నారు. అలాగే ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ, హైడ్రా చీఫ్ సెక్రటరీ అర్వింద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ పర్యవేక్షణ, భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పక్కన మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

శ్రమ దోపిడీ..
రెక్కలు ముక్కలు చేసుకుంటూ పని చేస్తున్న కార్మికులకు ఇచ్చే కూలి, జీతాల పట్ల కాంట్రాక్టర్లు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనుల్లో జార్ఖండ్‌కు చెందిన 150 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి రోజువారీ కూలీ రూ.600లు. అది కూడా మూడు నెలలుగా ఇవ్వడం లేదని కార్మికులు వాపోయారు. రోజుకు పది గంటలు పనిచేస్తున్నామని, మరో రెండు గంటలు లోకో ట్రైన్‌లో వచ్చిపోయేందుకు సమయం పడుతుందని, తాము ఇంటికి ఫోన్లు చేసి డబ్బులు వేయించుకుని నిత్యావసర వస్తువులు, బియ్యం తెచ్చుకుని వంట చేసుకుంటామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు బీమా సౌకర్యం లేకపోగా.. మృతి చెందితే వారికి నష్టపరిహారం సైతం ఇవ్వడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా గాయపడినా కాంట్రాక్టరు కనీసం చికిత్స కూడా చేయించకుండా ఇళ్లకు పంపిస్తున్న సంఘటనలు ఉన్నట్లు కార్మికులు ఆరోపించారు.



శిథిలాలను తరలించేందుకు లోకో ట్రైన్‌ను సిద్ధం చేస్తున్న సహాయక బృందం



సిబ్బందికి సూచనలిస్తున్న నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

సిగ్నల్స్ ఏర్పాటు ద్వారా..
సొరంగంలో విద్యుత్, సమాచార వ్యవస్థ వైర్లు, పరికరాలు దెబ్బతినడంతో సిగ్నల్స్ వ్యవస్థ రావడం లేదు. దట్టమైన అడవితో పాటు సొరంగం ప్రాంతంలో మొబైల్ సిగ్నల్స్ అందుబాటులో లేవు. ఈ దశలో ప్రభుత్వం సోమవారం హై ఫ్రీక్వెన్సీ సిగ్నల్స్ అందుబాటులోకి తీసుకొచ్చి ప్రమాదం జరిగిన చోటకు పంపించారు. దీని ద్వారా అక్కడి పరిస్థితులను అంచనా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

పై సెగ్మెంట్ బిగిస్తుండగా..
బోరింగ్ మిషన్(టీబీఎం) మీటరు దూరం సొరంగం తొలచిన తర్వాత మరో మిషన్ ద్వారా కాంక్రీట్ సెగ్మెంట్ బిగిస్తారు. 9 మీటర్ల వ్యాసంతో ఉండే ఈ సొరంగంలో మొత్తం 7 సెగ్మెంట్లు బోల్టుల ద్వారా బిగిస్తారు. చుట్టూ అటు ఇటు మూడు చొప్పున ఆరు సెగ్మెంట్లు బిగించి పై సెగ్మెంట్ బోల్టును బిగిస్తుండగా ఒక్కసారి వచ్చిన నీటి ఊటకు సెగ్మెంట్లు ఊడిపోయి ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ శిథిలాల కింద కార్మి కులు చిక్కుకొని ఉంటారని తోటి కార్మికులు భావిస్తున్నారు. అయితే ఆ ప్రాంతంలో నీటి ఊట, రాళ్లు, బురద కూరుకుపోవడంతో ముందుకు వెళ్లలేని పరిస్థితి తలెత్తినట్లు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పేర్కొంటున్నాయి.

సమర్థవంతంగా అమలుకు సూచనలివ్వండి
- కలెక్టర్ విజయేంధిర బోయి
- కేంద్ర బృందం సభ్యులతో సమావేశం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సాగే పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు సూచనలు ఇవ్వాలని కలెక్టర్ విజయేంధిర బోయి కేంద్ర బృందాన్ని సూచించారు. కామన్ రివ్యూ కమిషన్ కేంద్ర బృందం సభ్యులు జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం ఇక్కడి చేరుకొని వివిధ మండలాల్లో పర్యటించారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో కేంద్ర బృందం సభ్యులు కలెక్టర్‌తో సమావేశమయ్యారు. సీఆర్‌ఎం బృందం పర్యటనలో పీఆర్(పంచాయతీరాజ్) శాఖ ద్వారా చేపట్టిన రోడ్డు, వంతెన పనులు, మధ్యాహ్న భోజనం, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ పనుల నిర్వహణ, అమలులో పరిశీలించిన విషయాలు కలెక్టర్‌తో చర్చించారు. ఎన్‌సీపాల్ మహబూబ్‌నగర్‌లో ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం శిక్షణ, కోర్సుల అనంతరం ఉపాధి తదితర విషయాలపై గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్‌తో చర్చించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహబూబ్‌నగర్ మండలం బండమీదిపల్లి గ్రామంలో పీఎంజీఎస్‌వై ద్వారా నిర్మించిన బీటీ రోడ్డును పరిశీలించి నిర్మాణ, నిర్వహణ తీరును తెలుసుకున్నారు. డీఆర్‌డీఓ నర్సింహులు, అడిషనల్ డీఆర్‌డీఓ ముసాయిదాబేగం, పంచాయతీరాజ్ ఈఈ నరేందర్‌రెడ్డి ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు
రిజర్వ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేంధిర తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడం, ప్రజలలో ఆర్థిక అవగాహన పెంచేందుకు ఈ వారోత్సవాల లక్ష్యమన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ కల్వ భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామగ్రామాన ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మహిళా మండలి, మహిళా వ్యాపారవేత్తలు, సాధారణ గృహిణిలు మూడు కేటగిరీలకు చెందిన మహిళలుకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా పొదుపు, రుణం తదితర విషయాలపై అవగాహన కలిగించనున్నట్లు తెలిపారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేంధిర

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజావాణికి వచ్చే అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేంధిరబోయి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై 135 మంది సమర్పించిన అర్జీలను అధికారులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం పూర్తయ్యే వరకు తాగునీటి, విద్యుత్ సరఫరాపై మండలాల్లోని గ్రామాల వారీగా మండల ప్రత్యేకాధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు వడదెబ్బ బారినపడకుండా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, ఆర్డీఓ నవీన్, జెడ్పీ సీఈఓ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి
- మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి శివేంద్రప్రతాప్
- ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులతో సమీక్ష

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగర అభివృద్ధితో పాటు పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి శివేంద్రప్రతాప్ ఆదేశించారు. సోమవారం రాత్రి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, ఇంజినీరింగ్ శానిటేషన్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముడా, కార్పొరేషన్ నిధులతో వివిధ పనులు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలోని 22 పార్కులలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. వీటిలో అధ్వాన స్థితికి చేరిన ఐదింటిని వెంటనే బాగు చేసి అందుబాటులోకి తేవాలన్నారు. శిల్పారామంలో మిగిలిన పనులను పూర్తిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అలాగే మెయిన్ రోడ్డుతో పాటు ఆయా డివిజన్లలో స్వచ్ఛత కార్యక్రమాలు ముమ్మరం చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2024లో ఉత్తమ ర్యాంకు వచ్చేలా కృషి చేయాలన్నారు. అంతకుముందు అప్పన్నపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఇరువైపులా ఏర్పాటు చేసిన కుండీలను పరిశీలించారు. వాటిలో నాటిన మొక్కలకు ఎప్పటికప్పుడు నీరు పోసి పెంచాలన్నారు. అలాగే ఈ బ్రిడ్జి కింది ప్రాంతం మొత్తం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంఈ సందీప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, వజ్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న అధికారి శివేంద్రప్రతాప్

కోతల ‘భరోసా’
- పూర్తిస్థాయిలో అమలు కాని రైతు భరోసా
- మూడెకరాలలోపు ఉన్న వారికే అందిన అరకొర డబ్బులు
- సాగు భూమి ఉన్నా.. అందని సాయం
- అయోమయంలో రైతన్నలు



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా గందరగోళంగా మారింది. రైతు భరోసా పంపిణీలో కోతలు విధిస్తున్నారు. పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి రూ.6 వేల చొప్పున ఏడాదికి రెండుసార్లు రైతు భరోసా సాయం అందిస్తామని ప్రకటించింది. జనవరి 26వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించింది. మొదటి విడతలో మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులైన రైతులకు రూ.6 వేలు అందించింది. రెండో విడతలో ఎకరం లోపు, మూడో విడతలో రెండు ఎకరాల్లోపు, నాలుగో విడతలో మూడు ఎకరాల విస్తీర్ణం ఉన్న వారికి భరోసా నగదును ఖాతాల్లో జమ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. క్షేత్ర స్థాయిలో మాత్రం భిన్న పరిస్థితులు ఉన్నాయి. పలువురు అర్హులైన రైతులకు నిర్దేశితం కంటే తక్కువ విస్తీర్ణం ఉన్నప్పటికీ జమ కాలేదు. వ్యవసాయ శాఖతో పాటు బ్యాంకు అధికారులను సంప్రదిస్తే ప్రభుత్వమే నేరుగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తోందని చెబుతున్నారు.

అయోమయ పరిస్థితులు

గతంలో రూ.5వేల రైతుబంధు పొందిన రైతులకు వచ్చిన డబ్బులు కూడా ఇప్పుడు బ్యాంకు ఖాతాలో పడకపోవడంతో అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు. జిల్లాలో ఎంతోమంది రైతులు తాము సాగు చేస్తున్న, రికార్డు ఉన్న భూమికి రావాల్సిన రైతు భరోసా సాయం తక్కువ మొత్తంలో రావడంతో అయోమయ పరిస్థితుల్లో పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన డబ్బుల కంటే ఇప్పుడు ఎక్కువ రావాల్సి ఉండగా, అంతకంటే తక్కువ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాంకేతిక సమస్యలా.. బ్యాంక్ తప్పిదమా..

ప్రభుత్వం సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించి రైతు భరోసా పోర్టల్‌లో ఫ్రీజ్ చేసింది. తమ భూములను సాగుకు యోగ్యం కాని భూముల జాబితాల్లో చేర్చారనే ఆందోళనతో వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో పరిశీలిస్తే సాగుకు యోగ్యమైన భూముల జాబితాల్లో ఉన్నట్లు నిర్ధారణ జరుగుతుంది. సాంకేతిక సమస్యలా..బ్యాంకు తప్పిదమా..? అనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. భరోసా నగదు జమకాని రైతుల నుంచి వ్యవసాయశాఖ దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించేందుకు చొరవ చూపాలని రైతులు వేడుకుంటున్నారు.

38 గుంటలకు రూ.1,950 పడ్డయ్



నాకు 38 గుంటల భూమి ఉంటే 13 గుంటలకు రూ.1,950 పడ్డయ్. బీఆర్‌ఎస్ హయాంలో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు భరోసాలో కోతలు పెడుతుండ్రు. ఇదేందని ఏఓను అడిగితే మాకు తెల్వదు అంటుండు.

– టంకరి నాగమ్మ, రైతు, రామచంద్రాపూర్, మహబూబ్‌నగర్ రూరల్

రైతు భరోసా రాలే



నాకు 1.34 ఎకరాల భూమి ఉన్నా రైతు భరోసా రాలే. మా ఊర్లో కొంతమందికే పైసలు పడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు రైతు భరోసా పడలేదు. కొంతమందికేమో సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు వచ్చాయ్.. అకౌంట్లలో మాత్రం డబ్బులు జమ కాలే.

– ఎర్రగుంట నరేష్, రైతు, మాచన్‌పల్లి, మహబూబ్‌నగర్ రూరల్

రూ.112.40 కోట్లు జమ..



జిల్లాలో మూడెకరాల లోపు ఉన్న రైతులందరికీ రైతు భరోసా డబ్బులు పడ్డాయి. ఇప్పటి వరకు 1.52 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.112.40 కోట్లు జమ అయ్యాయి. అర్హులైన ప్రతి రైతుకు మార్చి నెలాఖరు వరకు ప్రభుత్వం రైతు భరోసా అందిస్తుంది. విడతల వారీగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి.

– బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

జిల్లాలో వివరాలు	అర్హులైన రైతులు	పంపిణీ చేయాల్సిన నగదు	ఇప్పటి వరకు అందుకున్న రైతులు
	1,71,913	రూ.126.46 కోట్లు	1,52,602
	ఖాతాల్లో జమ చేసిన నగదు	రూ.112.40 కోట్లు	

నెలలు పట్టే అవకాశం
రైతు భరోసా ప్రారంభించి నెల రోజులు సమీపిస్తున్నా ఇప్పటికీ కేవలం మూడు ఎకరాల లోపు రైతుల ఖాతాల్లో మాత్రమే డబ్బులు జమయ్యాయి. పది ఎకరాల లోపు రైతులకు రైతు భరోసా సాయం అందాలంటే రెండు నెలలపైనే సమయం పట్టే అవకాశముంది. ఆ లోపు రబీ పంట పూర్తయి మళ్లీ ఖరీఫ్ మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

కేఎల్ఐ లింక్ కెనాల్‌లో పడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు కేఎల్ఐ లింక్ కెనాల్‌లో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వనపట్ల శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకోగా సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం.. వనపట్ల గ్రామానికి చెందిన చిన్నయ్య (38) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతడు పని నిమిత్తం జిల్లా కేంద్రానికి ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు వనపట్ల శివారులోని కేఎల్ఐ లింక్‌కెనాల్‌లో పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. చిన్నయ్య కుమారుడు వెంకటస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

నవాబుపేట: ఈ నెల 19న రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ విక్రమ్ వివరాల ప్రకారం.. మండలంలోని అమ్మాపూర్ గ్రామానికి చెందిన అంకూరి కృష్ణయ్య(57) గత బుధవారం మండల కేంద్రానికి పని కోసం వచ్చి తిరిగి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో మండల కేంద్రం సమీపంలో మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కృష్ణయ్య కుమారుడు మనికంఠ ఫిర్యాదు మేరకు ద్విచక్రవాహనంతో ఢీ కొట్టిన సమీర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కంసాన్‌పల్లికి చెందిన వ్యక్తి..

దామరగిద్ద: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజు వివరాల ప్రకారం.. కంసాన్‌పల్లికి చెందిన నర్సింహులు(44) ఈనెల 15న భార్య లక్ష్మి కోసం అత్తగారి ఊరు దామరగిద్దకు వచ్చాడు. తాగుడుకు బానిసైన అతను ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీన్ని గమనించిన భార్య వెంటనే భర్తను నారాయణపేట ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ ఉస్మానియాకు వైద్యులు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వలస కూలి మృతి


మృతి చెందిన దిన్‌బంధు

శాంతినగర్: బతుకుదెరువు కోసం చత్తీస్‌ఘడ్ నుంచి జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజకు వచ్చిన వ్యక్తి మృతి చెందిన సంఘటన వడ్డేపల్లి మండలంలోని జక్కిరెడ్డిపల్లిలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం, సర్‌గాన్ గ్రామం నుంచి బోరుబండిలో పని చేయడానికి దిన్‌బంధు (20), అదే గ్రామానికి చెందిన విమల్, దీపక్‌లు అయిజకు వచ్చారు. ఆదివారం రాత్రి వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామంలో బోర్ వేసి అయిజకు తిరిగివెళ్తున్న క్రమంలో జక్కిరెడ్డిపల్లి వాగు వద్ద యూటర్న్ తిరిగే సమయంలో బోర్‌బండి బోల్తా పడింది. బోర్ బండిపై వెనకవైపు కూర్చున్న దిన్‌బంధుపై బోర్ రింగ్ పైపులు పడటంతో సంఘటనా స్థలంలో మృతి చెందాడు. దిన్‌బంధు అన్న బాసుదేవ్ బాగెల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

కత్తితో గొంతులో పొడుచుకున్న వృద్ధుడు


మల్లయ్య

నాగర్‌కర్నూల్ క్రైం: మతిస్థిమితంలేని వృద్ధుడు కత్తితో గొంతులో పొడుచుకున్న ఘటన జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డకాలనీలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం చిన్నకుంటపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య (90) జిల్లా కేంద్రంలో తన కుమారుడు బుచ్చన్న వద్ద ఉంటున్నాడు. మతిస్థిమితం లేని మల్లయ్యను కుటుంబ సభ్యులు ఇంట్లో ఉంచి సోమవారం బయటకు వెళ్లారు. ఈ నేపథ్యంలో మల్లయ్య కత్తితో గొంతులో పొడుచుకున్నాడు. ఇంటికి తిరిగి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి వృద్ధుడిని జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

భార్యను వేధించిన కేసులో భర్త రిమాండ్

మద్దూరు: భార్యను వేధించిన కేసులో భర్తకు 12 రోజుల పాటు కోస్గి మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. మండలంలోని హన్మనాయక్ తండాకు చెందిన భాస్కర్ నాయక్ మద్యానికి బానిసై ఎలాంటి పని చేయకుండా భార్య దేవిబాయ్‌ని అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో గతనెల 28న పూటుగా మద్యం తాగి భార్యపై కట్టెతో దాడి చేయగా ఆమె కుడి చేయి, శరీర భాగాలకు గాయాలయ్యాయి. దేవీబాయ్ ఫిర్యాదు మేరకు భర్త భాస్కర్‌నాయక్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

శివరాత్రికి శక్తి పీఠం ముస్తాబు


విద్యుద్దీపాల వెలుగుల్లో జోగుళాంబ అమ్మవారి ఆలయం

- నేటి నుంచి మార్చి 1 వరకు ఉత్సవాలు
- విద్యుద్దీపాల వెలుగుల్లో బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం
- జాగరణకు ప్రత్యేక ఏర్పాట్లు
- శైవ క్షేత్రానికి భారీగా తరలిరానున్న భక్తులు


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆలయ అధికారులు

అలంపూర్: దక్షిణ కాశిగా పేరుగాంచిన అలంపూర్ క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం నుంచి మార్చి 1 వరకు బాలబ్రహ్మేశ్వరుడి ఆలయంలో వేడుకలు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నవబ్రహ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. బాలబ్రహ్మేశ్వర ఆలయంలో గణపతి, వీరభద్ర, నంది మండపాలు, యాగశాల మండపాల్లో ఆవాహిత దేవత, సర్వోతభద్ర మండలి, వాస్తు, క్షేత్రపాలక, చతుషాస్థి యోగిని, నవగ్రహ మండపాలు సిద్ధం చేశారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు, ప్రధాన కూడలిలో ప్రచార ఫ్లెక్సీలు, ఆలయ పరిసరాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. తహసీల్దార్ మంజుల, పుర కమిషనర్ చంద్రశేఖర్‌రావు, ఎస్ఐ వెంకటస్వామి, ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు జగదీశ్వర్‌గౌడ్, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు డి.ఆనంద్‌శర్మ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఉత్సవాల నిర్వహణ వివరాలను సోమవారం ఈఓ పురేందర్ కుమార్, చైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డి వివరించారు.

భక్తుల సౌకర్యార్థం..

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పిస్తున్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యార్ ఆదేశాల మేరకు భక్తులకు ఉచితంగా పండ్లు, మజ్జిగ, తాగునీరు, ప్రసాదం అందించనున్నట్లు ఈఓ తెలిపారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు వేశారు. జాగరణకు వచ్చే భక్తుల కోసం కూచిపూడి, భరతనాట్యం, అన్నమయ్య సంకీర్తనలు, పౌరాణిక నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులకు పంపిణీ చేసేందుకు 25 వేల లడ్డూలు సిద్ధం చేశారు.

కార్యక్రమాలు ఇలా..

- మొదటి రోజు మంగళవారం బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 8 గంటలకు గోపూజ, ఆలయ ప్రదక్షణ, అనతి స్వీకరణ, ఆలయ ప్రవేశం, పుణ్యాహ వాచనం, కలశ స్థాపన, కంకణధారణ, రుత్విక్ వరుణం, మహా కలశస్థాపనలు, అఖండ దీప స్థాపన, రుద్రహోమాలు, మృత్యుంగ్రహణం, అగ్నిప్రతిష్ఠ, భేరీ పూజ, బలిహరణం. సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణం.
- బుధవారం మహా శివరాత్రి రోజున ఉదయం 4 గంటలకు బాలబ్రహ్మేశ్వరస్వామికి అభిషేకాలు, నిత్యపూజలు, హోమాలు, రాత్రి 9.30కి యమ పూజలు, ఏకాదశ రుద్ర పారాయణం, రాత్రి లింగోద్భవ సమయంలో విశేష అభిషేకాలు, శివ స్వాములతో ఆకాశదీప ప్రజ్వలనం, రాత్రి 2 గంటలకు జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి కల్యాణం.
- 27న ఉదయం 9 గంటలకు నంది వాహనసేవ, రుద్రహోమాలు, సాయంత్రం 6 గంటలకు హంస వాహనసేవ, రాత్రి 7 గంటలకు రథోత్సవం.
- 28న ఉదయం 9 గంటలకు నిత్య పూజలు, హోమాలు, బలిహరణం, 10 గంటలకు రావ ణ వాహనసేవ, రుద్ర హోమాలు, సా యంత్రం 5.30కి అశ్వవాహన సేవ (పార్వేట).
- మార్చి 1న ఉదయం నిత్యపూజలు, హోమాలు, బలిహరణం, ఉదయం 9 గంటలకు శేషవాహన సేవ, రుద్రహోమాలు, 11 గంటలకు పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, అవభృత స్నానం, ధ్వజ అవరోహణంతో ఉత్సవాలకు ముగింపు.


స్వాగత తోరణం


ఆలయ ఆవరణలో వేసిన చలువ పందిళ్లు

పాదయాత్రగా.. పరమేశ్వరుడి చెంతకు


నల్లమలలో పాదయాత్ర చేస్తున్న శివస్వాములు

- చలి, మండుటెండల్లో సైతం..
- అభయారణ్యంలో ప్రతిధ్వనిస్తున్న శివనామస్మరణ
- కోలాహలంగా నల్లమల రహదారి

అచ్చంపేట: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు శ్రీశైలానికి బారులుతీరారు. దట్టమైన నల్లమల అభయారణ్యంలో శివనామ సంకీర్తనలు చేసుకుంటూ శివ మాలధారులు, భక్తులు కాలినడకన మల్లన్న చెంతకు బయలెల్లినారు. మదినిండా శివయ్యను తలుస్తూ చలి, మండుటెండలను సైతం లెక్కచేయకుండా కొండలు, గుట్టలు దాటుతూ నీలకంఠేశ్వరుడిని దర్శించుకునేందుకు పోటెత్తుతున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి వచ్చే భక్తుల కాళ్లకు బొబ్బలెక్కుతున్నా శివయ్య స్మరణ ముందు వారికి అవేవి గుర్తుకు రావడంలేదు. దారులన్నీ భక్తులతో నిండిపోవడంతో శివ మాలధారులు సైతం రాత్రిళ్ల నడక సాగిస్తున్నారు. నిత్యం పక్షుల కిలకిలరావాలు, జంతువులు గర్జనలు వినపడే నల్లమలలో ప్రస్తుతం 'హర హర మహాదేవ.. శంభో శంకర' అని ప్రతిధ్వనిస్తోంది.

అటవీశాఖ నిబంధనలతో..

పాదయాత్రతో శ్రీశైల మహాక్షేత్రం వెళ్లే మాలధారులు, భక్తులకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకొచ్చి షామియానాలు, ఉచిత భోజన, తాగునీటి సౌకర్యాలతో పాటు అల్పాహారం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. మన్ననూర్, పర్హాబాద్, వటువర్లపల్లి, రాసమల్లబావి వద్ద 15 నుంచి 16ఏళ్లుగా దాతలు భక్తులకు సేవలందిస్తున్నారు. అచ్చంపేట–శ్రీశైలం నల్లమల అభయారణ మార్గంలో 20కిపైగా అన్నదాన కేంద్రాలు వెలిశాయి. మన్ననూర్ తర్వాత వటువర్లపల్లి వరకు ఎక్కడ కూడా వీరికి తాగేందుకు గుక్కెడు నీరు కూడా దొరకని పరిస్థితి ఉంది. వటువర్లపల్లి తర్వాత మళ్లీ దోమలపెంట వరకు ఇదే పరిస్థితి ఉంటుంది.

పాదయాత్ర చేసే భక్తులకు అటవీ జంతువుల నుంచి రక్షణ కల్పించేందుకు అధికారులు సిబ్బందితో పహారా కాస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధంపై భక్తులకు అవగాహన కల్పిస్తున్నారు.

భక్తుల ఆకలి తీరుస్తున్న నిత్యాన్నదాన సత్రాలు

శ్రీశైలంలో 50కి పైగా నిత్యాన్నదాన సత్రాలు ఉండగా.. అన్నపూర్ణాదేవికి అర్చనలు చేస్తున్నారు. వాసవీ సత్రం, కొండవీటి రెడ్ల సత్రం, మున్నూరుకాపు సత్రం, వెలమ సత్రం, విశ్వబ్రాహ్మణ సత్రం, అన్నదాన సత్రం, కమ్మసత్రం, కాకతీయ సత్రం, కంబం సత్రం, యాదవ సత్రం, శ్రీకృష్ణ దేవరాయ సత్రం, ఆరెకటిక, మేరుసంఘం, వెలమ, వందేళ్లనాటి కరివెన సత్రాలతో పాటు మరిన్ని సత్రాలు నిరాటకంగా నిత్య అన్నదానాలు చేస్తున్నారు. ఇక ఆశ్రమాలు, మఠాల సంగతి చెప్పనక్కర్లలేదు. శివరాత్రి బహ్మోత్సవాల సందర్భంగా అటకేశ్వర సమీపంలోని నాలుగు ఆశ్రమాలు వేలాది మంది భక్తుల ఆకలి తీరుస్తున్నాయి. శ్రీశైలంలో ఒక్కరికి అన్నదానం చేస్తే కాశీలో లక్షమందికి అన్నదానం చేసిన పుణ్యం కలుగుతుందనే భావనతో దాతలు అన్నసత్రాలకు విరాళాలు సమర్పిస్తున్నారు.


మాలధారులకు మజ్జిగ అందిస్తున్న దాతలు

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

- హైదరాబాద్‌లో స్నేహితుడిని కలిసేందుకు వెళ్తూ ఇద్దరు..
- వాహనం బోల్తా పడి వ్యక్తి ..
- బంధువులను తీసుకెళ్తూ యువకుడు..


చరణ్‌రెడ్డి (ఫైల్)


అనిల్ (ఫైల్)

సాక్షి నెట్‌వర్క్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. కొత్తకోట నుంచి హైదరాబాద్‌కు మిత్రుడిని కలిసేందుకు బైక్‌పై వెళ్తూ ఇద్దరు యువకులు మృతిచెందారు. అలాగే దినసరి కూలీగా పనిచేసే వ్యక్తి లోడ్‌ను దించేందుకు వెళ్తూ వాహనం అదుపుతప్పి బోల్తాపడగా అక్కడికక్కడే మరణించాడు. అన్న పెళ్లి ముగిశాక మేనత్త, మామలను తీసుకెళ్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో యువకుడు అనంతలోకాలకు చేరాడు..

భూత్పూర్: హైదరాబాద్‌లో మిత్రుడిని కలవడానికి బైక్‌పై బయలుదేరిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. కొత్తకోట పట్టణానికి చెందిన చరణ్‌రెడ్డి(23), అనిల్(23) కొత్తకోట నుంచి హైదరాబాద్‌లో మిత్రుడిని కలవడానికి సోమవారం ద్విచక్రవాహనంపై బయలుదేరారు. అయితే మార్గమధ్యలో గాజులపేట వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి జాతీయ రహదారికి పక్కనే ఉన్న రేలింగ్‌ను తాకి బ్రిడ్జిని ఢీకొట్టింది. దీంతో చరణ్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా.. అనిల్ మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రి మృతిచెందిన 18 రోజులకే..

కొత్తకోటకు అనిల్ మదనాపురం సమీపంలోని ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. అయితే అనిల్ తండ్రి 18 రోజుల క్రితమే మృతిచెందాడు. చరణ్‌రెడ్డి తండ్రి తిరుపతిరెడ్డి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తండ్రికి చరణ్‌రెడ్డి వ్యవసాయ పనుల్లో ఆసరాగా ఉంటున్నాడు. ఈ ఘటనతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

దినసరి కూలీగా పనిచేస్తూ..


బైండ్ల రాములు (ఫైల్)

మద్దూరు: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో ఇద్దరు గాయాల పాలైన ఘటన కొత్తపల్లి మండలం నిడ్జింతతండా సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు, ప్రత్యక్షుల కథనం మేరకు.. మద్దూరుకు చెందిన జంగెటి నర్సప్ప, మోనపురం తిమ్మప్ప, బైండ్ల రాములు (45) తిరుమల ట్రేడర్స్‌లో దినసరి కూలీలుగా కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. సోమవారం వాహనంలో 60 బస్తాల సిమెంట్‌ను తీసుకొని కొత్తపల్లిలో దించడానికి బయలుదేరారు. మార్గమధ్యంలో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న వీరిపై సిమెంట్ బస్తాలు పడటంతో బైండ్ల రాములు అక్కడికక్కడే మృతిచెందగా.. జంగెటి నర్సప్ప, మోనపురం తిమ్మప్పకు గాయాలయ్యాయి. స్థానికులు వీరిని వెంటనే 108 వాహనంలో మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పెళ్లింట్లో విషాదం

శాంతినగర్: రాత్రి వరకు పెళ్లి వేడుకలతో కళకళలాడిన ఆ ఇంట్లో పెళ్లి కుమారుని తమ్ముడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో విషాదం నెలకొంది. వడ్డేపల్లి మండలం బుడమర్సు గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామానికి చెందిన రాజన్నకు ఇద్దరు కుమారులు కాగా.. పెద్ద కుమారుడు జానకిరాముడు వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. పెళ్లికి వచ్చిన మేనత్త శిరీషమ్మ, మామ రాజులను సోమవారం తెల్లవారుజామున మోటార్‌సైకిల్‌పై పెళ్లి కుమారుని తమ్ముడు మురళి(19) శాంతినగర్‌కు తీసుకుని వెళ్తుండగా మార్గమధ్యలో బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మురళి అక్కడికక్కడే మృతిచెందగా అత్త, మామలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఇరువురిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మురళి మృతిచెందిన విషయం తెలియడంతో సంతోషంగా ఉండాల్సిన పెళ్లి పందిరిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న శాంతినగర్ ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'సింథటిక్ కెమికల్స్ అనుమతులు రద్దు చేయాలి'


మాట్లాడుతున్న తెలంగాణ పీపుల్స్ జేఏసీ కోకన్వీనర్ రవిచంద్ర

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

చిన్నచింతకుంట: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీకి అనుబంధంగా సింథటిక్ కెమికల్స్ కంపెనీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ పీపుల్స్ జేఏసీ కోకన్వీనర్ రవిచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో చిన్నచింతకుంట మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ ప్రభుత్వాలు మహబుబ్‌నగర్ రైతాంగాన్ని చిన్నచూపు చూస్తూ రైతులను అరిగోస పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని చిత్తనూర్ సమీపంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని ఏర్పాటు చేశారన్నారు. ఈ ప్రభావంతో వాతావరణ కాలుష్యం ఏర్పడి మరికల్, నర్వ, దేవరకద్ర, అమరచింత మండలాల రైతులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయని వాపోయారు. దీనికి తోడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆకంపెనీకి అనుబంధంగా సింథటిక్ కెమికల్స్ పరిశ్ర ఏర్పాటుకు అనుమతులు ఇచ్చిందని మండిపడ్డారు.

ఇబ్బందులు తప్పవు

ఈ కంపెనీ ఏర్పాటయితే వాతావరణ కాలుష్యం తీవ్రంగా ఏర్పడి నారాయణపేట, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాలకు చెందిన పలు మండలాల రైతులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. వీటి ఇబ్బందులు పట్టించుకోని ప్రభుత్వం రైతుల నుంచి తక్కువ ధరకు భూములు లాక్కొని పెట్టుబడిదారులకు కట్టబెట్టిందని ధ్వజమెత్తారు. పాలమూరులో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేసి బీడు భూములకు సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాలమూర్ అధ్యాయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవచారి, జే చక్రవర్తి, ఎం ఖలీల్, యాదగిరి, మన్యంకొండ, మహదేవ్, శాంతమ్మ, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటసాగులో సస్యరక్షణ

- పసుపు అట్టల పాత్ర కీలకం
- పెరిగిన పురుగు మందుల వినియోగం


మిర్చి పంటలో ఏర్పాటు చేసిన పసుపు అట్ట


పంటలో ఏర్పాటు చేసిన పసుపు రంగు అట్ట

అలంపూర్: పంట సాగులో పురుగు మందుల వినియోగం పెరిగింది. మన దేశంలో పురుగు మందుల వినియోగం 1955లో 200 టన్నులు ఉండగా ప్రస్తుతం 1,50,000 టన్నుల వినియోగం అవుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ద్వారా తెలుస్తోంది. మన దేశంలో హెక్టారుకు సగటున 0.5 కేజీలు, అమెరికాలో 1.5 కిలోలు, ఐరోపాలో 2.5 కేజీలు, జపాన్‌లో కేజీలు పురుగు మందులు వాడకం జరుగుతుందని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. సమగ్ర సస్యరక్షణ ద్వారా ఈ పురుగు మందుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ రైతులకు వివరించారు.

పసుపు పచ్చ అట్టల పాత్ర..

టమాటా, మిరప ఇతర పంటల్లో రసం పీల్చే పురుగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా తెల్ల దోమ, పచ్చ దోమ, తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. తెల్లదోమ వల్ల మిరప పంటకు జెమిని వైరస్, కుకుంబర్ మొజాయిక్ వైరస్ ఆశిస్తుంది. దీని వల్ల పంటకు తీవ్రమైన నష్టాన్ని కలుగజేస్తుంది. వాటిని అరికట్టడానికి వినూత్నమైన సమగ్ర సస్యరక్షణలో భాగంగా పసుపు రంగు అట్టలు ఏ రకమైన పురుగునైనా గుణం ఉంటుంది. ఈ పసుపు రంగు అట్టలను కట్టెలకు పెట్టి సాళ్ల వెంబడి క్రమ పద్ధతిలో అమర్చాలి. ఈ అట్టలకు జిగురు లేదా గ్రీసు పూస్తే ఈ జిగురుకు తెల్ల దోమ, పచ్చ దోమ, ఎర్ర నల్లి, తామర పురుగులు అంటుకోని చనిపోతాయి. దీనితో ముడత తెగులు పూర్తిగా తగ్గిపోతుంది. రసాయనిక పురుగుల మందులు వాడకుండా అతి తక్కువ ఖర్చుతో రసం పీల్చే పురుగులను నియంత్రించే ఈ మ్యాజిక్ ప్లేటు ఎకరానికి 20 నుంచి 30 వరకు అమర్చుకోవాలి. దీనికి ఎకరాకు వెయ్యి వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

సమగ్ర సస్యరక్షణలో 4 పద్ధతులు :

1. సాగు పద్ధతి
2. యాంత్రిక పద్ధతి
3. జీవ నియంత్రణ పద్ధతి
4. పర్యావరణ హిత క్రిమి సంహారక మందులు

యాంత్రిక పద్ధతులు సమగ్ర సస్యరక్షణతో ముఖ్యపాత్రను పోషిస్తాయి. అటువంటి వాటిలో కొన్ని

- నారు మొక్కకు చివరలు తుంచి వేయుట
- చీడ పీడలు ఆశించి భాగాన్ని తుంచి వేయుట
- పక్షి స్థావరాలు ఏర్పాటు చేయుట
- దీపపు ఎరలు నెలకొల్పుట
- శత్రు గుడ్ల సముదాయాన్ని సేకరించి నాశనం చేయుట
- రాత్రి పూట గుడ్లపై మంటలు వేయుట
- పసుపు పచ్చ అట్టలు(జిగురు పూసిన) ఏర్పాటు చేసుకోనుట

ఆర్టీసీ డ్రైవర్‌కు ఫిట్స్

- కొంతసేపు నిలిచిపోయిన బస్సు

స్టేషన్ మహబూబ్‌నగర్: పరిగి డిపోకు చెందిన ఓ ప్రైవేట్ హైర్ బస్సు సోమవారం ఉదయం 11గంటల ప్రాంతంలో మహబూబ్‌నగర్ నుంచి పరిగికి వెళ్తున్న సమయంలో తెలంగాణ చౌరస్తా నుంచి పాతబస్టాండ్ పరిధిలో డ్రైవర్‌కు ఆకస్మాత్తుగా ఫిట్స్ వచ్చాయి. డ్రైవర్ చాకచక్యంగా బస్సును రోడ్డుకు పక్కకు నిలిపినట్లు తెలిసింది. ప్రయాణికులు వెంటనే అతడిని చికిత్స కోసం 108లో ఆస్పత్రికి తరలించారు. బస్సులో దాదాపు 50 నుంచి 60 మంది ప్రయాణికులు ఉండగా అరగంట తర్వాత అక్కడి నుంచి బస్సు కదిలింది.

11 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రాజోళి: మండలంలోని తూర్పు గార్లపాడులో ఇసుక తరలించేందుకు వెళ్లిన 11 ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీష్ తెలిపారు. మండలంలోని తూర్పుగార్లపాడులో జిల్లాలోని ఇసుక అవసరాల కోసం తవ్వే అనుమతులు ఉన్నాయి. ఆన్‌లైన్ ద్వారా ఇసుక బుకింగ్, డెలివరీ జరుగుతున్నాయి. కాగా..ఉదయం 7 గంటలకు మెసేజ్ వస్తే నదిలోకి వెళ్లాల్సి ఉండగా.. తెల్లవారుజామున 3 గంటలకే నదిలోకి ట్రాక్టర్లు వెళ్లాయన్నా సమాచారం మేరకు ఎస్ఐ జగదీష్ తన సిబ్బందితో కలిసి నదిలోకి వెళ్లి 11 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి, అక్రమంగా ఇసుక తరలిస్తున్న మినీ టిప్పర్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

